సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

7

బుధవారం । 5 । జూలై । 2023

అడవిలో ఆతిథ్యం

చుట్టూ ఎత్తైన చెట్లు.. దూరంగా గలగల పారే సెలయేళ్లు.. ఉరికే జలపాతాలు.. మన పక్కనే పక్షుల కిలకిలారావాలు... ఎక్కడ చూసినా పచ్చదనం .. వీటి మధ్య సుతారంగా చల్లని గాలి మేనును తాకుతుంటే ఆ అనుభూతే వేరు. అచ్చంగా ఇలాంటి అనుభూతిని ప్రకృతి ప్రేమికులకు అందజేసేందుకు అటవీశాఖ సరికొత్త ప్రాజెక్టుకు రూపకల్పన చేస్తోంది. దట్టమైన అటవీ ప్రాంతంలో పర్యాటకులు గడిపేలా.. అడవి తల్లి ఒడిలో సేద తీరేలా.. నవ లోకంలో విహరించేలా... ఎకో ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు.

- ప్రకృతి ప్రేమికుల కోసం సరికొత్త ప్రాజెక్టు
- దట్టమైన అటవీ ప్రాంతంలో గడిపే అవకాశం
- ట్రీహట్స్‌లో విశ్రాంతి
- మర్ధగుడ సమీపంలో ఏర్పాటుకు చర్యలు
- సింహాద్రి ఎన్టీపీసీ సహకారంతో రూ.5.5 కోట్లతో పనులు



అటవీశాఖ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన రాక్‌ఫిల్ డ్యాం



అటవీ ప్రాంతం

అనంతగిరి: దట్టమైన అటవీ ప్రాంతంలోని గడపాలని చాలా మంది ప్రకృతిప్రేమికులు కోరుకుంటారు. అలాంటి అవకాశాన్ని కల్పించేందుకు సరికొత్త ప్రాజెక్టు రూపకల్పనపై అటవీశాఖ దృష్టిసారించింది. దట్టమైన అటవీ ప్రాంతంలోని ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపి నూతన అనుభూతిని పొందేలా త్వరలో ప్రాజెక్టు అందుబాటులోకి తీసుకొచ్చేలా చర్యలు చేపట్టింది. అనంతగిరి మండలంలోని మర్ధగుడ సమీపంలో చాపరాయిని ఆనుకుని ఉన్న అటవీ ప్రాంతంలో ఎకో టూరిజం ప్రాజెక్టుకు రూపకల్పన చేయనుంది. ఇందుకు నిధులు సమకూర్చేందుకు ఎన్టీపీసీ సింహాద్రి ముందుకు వచ్చింది. రూ.5.5 కోట్లతో ప్రాజెక్టు నిర్మాణం జరగనుంది. ఇప్పటికే రెండు కొండలను ఆనుకుని ఉన్న కాఫీ తోటల్లో ఏడు రాక్ ఫీల్ డ్యామ్‌లను(రాతి కట్టలను) నిర్మించారు.

పర్యాటకులకు సరికొత్త అనుభూతి

దట్టమైన అటవీ ప్రాంతంలోని నిర్మాణం జరగనున్న ఈ ఎకోటూరిజం ప్రాజెక్టు పూర్తయితే పర్యాటకులు నూతన అనుభూతిని పొందుతారు అనడానికి సందేహం లేదు. ముఖద్వారం నుంచి దట్టమైన చెట్ల నడుమ ప్రయాణం సాగుతుంది. ప్రకృతి అందాలను ఆస్వాదిస్తూ ప్రయాణించవచ్చు. కాఫీ తోటల్లో చల్లని వాతావరణం మలుపులతో సాగే ఈ ప్రయాణమే ప్రకృతి ప్రేమికులు నూతనోత్తేజాన్ని ఇస్తుంది.

ట్రీహట్స్ :

ప్రకృతి అందాలను పాడుచేయకుండా చెట్లపై హట్స్ నిర్మించేందుకు అటవీశాఖ చర్యలు చేపడుతోంది. వీటిలో బస చేసే పర్యాటకులకు సరికొత్త అనుభూతే కలుగుంది.

స్థానికులకు ఉపాధి

మర్ధగుడ వన సంరక్షణ సమితి (వీఎస్ఎస్)లో 80 మంది వరకు గిరిజనులు సభ్యులుగా ఉన్నారు. ప్రాజెక్టుకు వీరిని అనుసంధానం చేస్తూ, ఉపాధి కల్పించేలా అటవీశాఖ చర్యలు చేపట్టింది.

ప్రాజెక్టు విశేషాలు

- ప్రాజెక్టు ద్వారా వచ్చే ఆదాయాన్ని నిర్వహణతో పాటు స్థానిక గిరిజనుల అభివృద్ధికి, అటవీ, వన్యప్రాణుల పరిరక్షణకు వినియోగించనున్నారు.
- ఓపెన్ బటర్‌ఫ్లై గార్డెన్, ఔషధ మొక్కల వనం, వాచ్ టవర్ ఏర్పాటు చేయనున్నారు.
- తూర్పు కనుమల్లోని జీవవైవిధ్యం గురించి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రత్యేక స్టడీ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.
- ప్రజలకు సేంద్రియ, స్వచ్ఛమైన అటవీ ఉత్పత్తులను అందించేలా చిన్న చిన్న వ్యాపార సముదాయాలు కూడా రానున్నాయి. ఇందులో పనస, చింతపండు, ఔషధ మొక్కలు, ఏజెన్సీలో దొరికే అరుదైన పళ్లు, మొక్కల్ని విక్రయించనున్నారు.

నూతన అనుభూతి...

ఈ ప్రాజెక్టు పూర్తయితే పర్యాటకులు నూతన అనుభూతి పొందుతారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంతో స్థానిక గిరిజనులకు ఉపాధి లభించనుంది. ఇప్పటికే రాతి కట్టడాలను నిర్మించాం. చెట్ల నడుమ రాతి కట్టడాలు ప్రత్యేక ఆకర్షణగా ఉన్నాయి.

– దుర్గాప్రసాద్, ఫారెస్ట్ రేంజర్ అనంతగిరి

విద్యార్థుల ఆరోగ్యంపై
ప్రత్యేక శ్రద్ధ

ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే



మారేడుమిల్లి పాఠశాలలో నిత్యావసర సరకులను పరిశీలిస్తున్న పీవో సూరజ్ గనోరే

మారేడుమిల్లి: ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే అన్నారు. స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. పాఠశాలలోని స్టోర్ రూమ్, తరగతి, హస్టల్ గదులు, వంటశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా శ్రద్ధ తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మెనూ సక్రమంగా అమలుచేయాలని, నిత్యావసర సరకులు, కూరగాయలు తాజాగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. జగనన్న విద్యా దీవెన కిట్లు ప్రతివిద్యార్థికీ అందాయాలేదాఅని ఆరా తీశారు.

చింతూరు: స్థానిక గురుకుల పాఠశాల, నర్సింహపురం బాలురు, బాలికల ఆశ్రమ పాఠశాలలను ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలల్లోని స్టాక్ రూంలు, రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంకా పాఠశాలలకు రాని పిల్లలను గుర్తించి త్వరగా వచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మెనూ సక్రమంగా అమలు చేయాలని, రిజిస్టర్లను క్రమ పద్ధతిలో నిర్వహించాలని సూచించారు.

న్యూస్‌రీల్

4,469 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

సాక్షి,పాడేరు: జిల్లాలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష పథకం శిబిరాలు విజయవంతమయ్యాయని కలెక్టర్ సుమిత్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 12మండలాల పరిధిలో 20 సచివాలయాల్లో జగనన్న సురక్ష పథకం శిబిరాలు నిర్వహించి, 4,469 ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేసినట్టు పేర్కొన్నారు. 20,314 గృహాల నుంచి వివిధ ధ్రువీకరణ పత్రాల కోసం 19,210 వినతులు వచ్చాయన్నారు.15,089 టోకెన్లు నమోదు చేసి,10,590 దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామన్నారు.వీటిలో 4,469 ధ్రువీకరణ పత్రాలు జారీచేయగా, 78 దరఖాస్తులను తిరస్కరించినట్టు తెలిపారు. మిగిలిన 6,043 పత్రాల పంపిణీని రెండు రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించినట్టు కలెక్టర్ తెలిపారు. జగనన్న సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బలోర్డాలో ఎలుగుబంటి మృతి



మృతి చెందిన ఎలుగుబంటిని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు, పశువైద్య సిబ్బంది

హుకుంపేట: అనుమానాస్పద స్థితిలో ఓ ఎలుగుబంటి మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి, మండలంలోని రంగశీల పంచాయతీ బలోర్డా గ్రామ సమీపంలో గల చెట్ల వద్దకు మామిడి పళ్లు సేకరించేందుకు ఆ గ్రామస్తులు కొంతమంది మంగళవారం వెళ్లారు. అక్కడ కొన ఊపిరితో ఉన్న ఎలుగుబంటి కనిపించింది. భీతిల్లిన వారు పరుగులు తీస్తూ గ్రామంలోకి వెళ్లి సమాచారాన్ని అందజేశారు. గ్రామస్తులు వెళ్లే సరికి ఎలుగుబంటి మృతి చెందింది. డీఎఫ్‌వో వినోద్‌కుమార్, అటవీశాఖ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని మృతి చెందిన ఎలుగుబంటిని పరిశీలించారు. హుకుంపేట పశువైద్యాధికారి చరణ్.. పంచనామా చేసి, పూడ్చి వేయించారు. అడవి పందులను వేటాడేందుకు వేటగాళ్లు వేసిన ఉచ్చులో పడి తప్పించుకునే క్రమంలో ఎలుగుబంటి గాయపడి మృతిచెంది ఉండవచ్చని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు.

ట్రైబల్ కల్చరల్ అండ్ ట్రైనింగ్ మిషన్‌కు ఐఎస్‌వో సర్టిఫికెట్



సర్టిఫికెట్ అందుకుంటున్న సంస్థ ప్రతినిధులు

డాబాగార్డెన్స్: ట్రైబల్ కల్చరల్ అండ్ ట్రైనింగ్ మిషన్‌కు అంతర్జాతీయ నాణ్యతా ప్రమాణాల సంస్థ (ఐఎస్‌వో) గుర్తింపు లభించింది. సంస్థను అత్యంత క్వాలిటీ మేనేజ్‌మెంట్‌గా గుర్తిస్తూ ఐఎస్‌వో 9001–2015 సర్టిఫికెట్ జారీ చేసింది. నగరంలో మంగళవారం జరిగిన ఓ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి రాజన్న దొర చేతుల మీదుగా ట్రైబల్ కల్చరల్ అండ్ ట్రైనింగ్ మిషన్ ప్రతినిధులు సర్టిఫికెట్ అందుకున్నారు. అరకు ఎంపీ మాధవి, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, హైమా ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ సంస్థ ఎండీ ఆలపాటి శివ, సన్ గ్రీన్ సీఈవో డాక్టర్ శృతి పాల్గొన్నారు.

11 అడుగుల నాగజెర్రి హతం



గిరిజనుల చేతిలో హతమైన నాగజెర్రి

ముంచంగిపుట్టు: మండల కేంద్రం ముంచంగిపుట్టులో మంగళవారం 11 అడుగుల నాగ జెర్రిని స్థానిక గిరిజనులు హతమార్చారు. కప్పను మింగి ఎటూవెళ్లలేక స్థానిక వస్త్ర వ్యాపారి కె.మోహన్ ఇంటి లోపల ఉన్న పామును గమనించిన కొంతమంది చాకచక్యంగా పట్టుకుని హతమార్చారు. కొండ ప్రాంతంలో ఇల్లు ఉండడంతో పాము లోపలికి ప్రవేశించినట్టు స్థానికులు తెలిపారు.

27న జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట: జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు ఈనెల 27న నిర్వహించనున్నట్టు సీఈవో శ్రీరామ్మూర్తి తెలిపారు. జిల్లా పరిషత్ ఆవరణలో జెడ్పీ చైరపర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు స్థాయీ సంఘాల సమావేశాలు జరుగుతాయని, ఈ మేరకు సభ్యులకు ఆహ్వానం పంపినట్టు పేర్కొన్నారు.

వరదలపై అప్రమత్తంగా ఉన్నాం

కలెక్టర్ సుమిత్ కుమార్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చింతూరు: విలీన మండలాల్లో వరదలు వస్తే దీటుగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ సుమిత్ కుమార్ తెలిపారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇప్పటికే వరద ప్రభావిత మండలాల్లో నిత్యావసర సరకుల నిల్వకు అన్ని చర్యలు తీసుకున్నట్టు చెప్పారు. గత ఏడాది వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని, ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించి అక్కడి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. వరదల సమయంలో నిత్యావసర సరకులు తరలించేందుకు ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించామని చెప్పారు. ఉపాధిహామీ పథకం ద్వారా ఈ రహదారులను బాగు చేయనున్నామని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వారిని పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు నిత్యాసవర సరకులు అందేలా చర్యలు చేపడతామన్నారు.

నేడు వరదపై సమీక్ష సమావేశం

వరదలకు సంబంధించి తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై బుధవారం చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో వరదలు సంభవిస్తే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించడంతో పాటు ఆయా మండలాల్లో నిత్యావసర సరకులను ముందుగానే నిల్వ చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో చర్చించనున్నారు.

తూనిక, కొలతల్లో మోసాలపై కేసులు

జి.మాడుగుల: సంతల్లో తూనికలు కొలతల్లో అక్రమాలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో మంగళవారం పాడేరు, నర్సీపట్నాలకు చెందిన లీగల్ మెట్రాలజీ అధికారులు స్థానిక వారపుసంతలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. మోసాలకు పాల్పడుతున్న కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు, చేపల విక్రయదారులపై లీగల్ మెట్రాలజీ పరిశీలకులు డి.అనురాధ, సిబ్బంది ఏడు కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ తూకాల్లో మోసాలకు సంబంధించిన ఎటువంటి ఎటువంటి ఫిర్యాదులైన తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు చేపడుతామని తెలిపారు.



జి.మాడుగులలో చేపల దుకాణం వద్ద తూనిక గుళ్లను తనిఖీ చేస్తున్న అనురాధ

అల్లూరి ఆశయ సాధనకు కృషి

కలెక్టర్ సుమిత్ కుమార్



అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



కలెక్టరేట్‌లో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ శివశ్రీనివాస్



బందపల్లిలో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి



చింతపల్లిలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

చింతూరు: దేశంకోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా చింతూరు ఐటీడీఏ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పీవో సూరజ్ ధనుంజయ్ గనోరేతో కలసి ఆయన అల్లూరి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలో బ్రిటీషు వారికి వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడి పేరును మన జిల్లాకు పెట్టడం ఎంతో అదృష్టమన్నారు. ఈ ప్రాంత ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజును ఎల్లప్పుడూ స్మరించుకోవాలని తెలిపారు.

అల్లూరి పోరాట స్ఫూర్తితో దేశసేవ

సాక్షి,పాడేరు: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజును ప్రజలంతా ఆదర్శంగా తీసుకుని చైతన్యవంతులు కావాలని జేసీ జె.శివశ్రీనివాస్ అన్నారు.కలెక్టరేట్‌లోని అల్లూరి సీతారామ రాజు కాంస్య విగ్రహానికి జేసీతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు,అధికారులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ అల్లూరి పోరాట స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ దేశసేవలో భాగస్వాములుకావాలన్నారు. అల్లూరి పేరుతో ప్రభుత్వం పాడేరు కేంద్రంగా జిల్లాను ఏర్పాటు చేయడం మంచి పరిణామమన్నారు. పాడేరు ఎంపీపీ ఎస్.రత్నకుమారి,జి.మాడుగుల జెడ్పీటీసీ,ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి మాట్లాడుతూ అల్లూరిని గిరిజన జాతి ఎన్నటికీ మరువదన్నారు. ఈకార్యక్రమంలో డీఆర్‌వో అంబేడ్కర్, తహసీల్దార్ త్రినాథరావునాయుడు, చింతలవీధి ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, మాజీ ఎంపీపీ ఎస్.వి.వి.రమణమూర్తి,ఎస్టీవిభాగం జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ,మహిళా విభాగంనేత ఐశ్వర్యరాణి తదితరులు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: అల్లూరి సీతారామరాజు చేసిన సేవలు మరువలేనివని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్నారు.మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలసి మంగళవారం ఆమె అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనులంతా అల్లూరి అడుగుజాడల్లో నడవాలన్నారు. ఆయన పోరాట పటిమను స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పోతురాజు బాలయ్య, సర్పంచ్ దురియా పుష్పలత, జీకే వీధి ఎంపీపీ,జెడ్పీటీసీలు బోయిన కుమారి,కిముడు శివరత్నం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మోరి రవి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ మీరా, ఎంపీటీసీలు ధారలక్ష్మి,జయలక్ష్మి, కో–ఆప్షన్ సభ్యుడు నాజర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం : మండలంలోని బందపల్లిలో జరిగిన అల్లూరి సీతారామరాజు జయంతి కార్యక్రమంలో రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు. అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ బందం శ్రీదేవి, జెడ్పీటీసీ పండా వెంకటలక్ష్మి, వైస్ఎంపీపీలు కొమ్మిశెట్టి బాలకృష్ణ, కుమారి, మంగాబొజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

రేటు వెరీ ‘గుడ్డు’!

- వంద కోడిగుడ్ల ధర రూ.515
- నిన్న మొన్నటి వరకు రూ.550
- ఈ సీజనులో ఇదే అత్యధికం
- ఇక క్రమంగా ధర దిగి వచ్చే అవకాశం
- ఉత్తరాంధ్రలో రోజుకు 50 లక్షల గుడ్ల ఉత్పత్తి
- వీటిలో 40 లక్షల వరకు స్థానికంగా వినియోగం



సాక్షి, విశాఖపట్నం: ఎండలతో పాటే కోడిగుడ్డు ధర కూడా ఎగబాకింది. ప్రస్తుతం వంద గుడ్ల రేటు రూ.515 పలుకుతోంది. నిన్న మొన్నటి వరకు ఈ సీజనులోనే అత్యధికంగా వీటి ధర రూ.550 ఉంది. నెల రోజుల క్రితం జూన్ ఒకటో తేదీన విశాఖపట్నంలో వంద కోడిగుడ్ల రేటు రూ.510 ఉండేది. అలా క్రమంగా పెరుగుతూ జూన్ 15 నాటికి రూ.550కి చేరుకుంది. దాదాపు 20 రోజుల పాటు అదే ధర కొనసాగింది. మంగళవారానికి రూ.35 తగ్గి రూ.515కి దిగి వచ్చింది. మార్కెట్లో రిటైల్‌గా ఒక్కో గుడ్డు రూ.6 చొప్పున విక్రయిస్తున్నారు. వంద గుడ్ల ధర రూ.550 ఉన్నప్పుడు విడిగా రూ.7కి అమ్మేవారు. గుడ్ల ధరలు పెరగడానికి కొన్ని నెలలుగా కాస్తున్న ఎండలు, వడగాడ్పులు కారణమని కోళ్ల పెంపకందార్లు చెబుతున్నారు. వడగాడ్పుల తీవ్రతకు కోళ్లు చనిపోతుంటాయి. అలాగే వేసవి తాపానికి ఫారాల్లోని కోళ్లు సరిగా మేత తినవు. దీంతో 10 శాతం వరకు గుడ్ల ఉత్పత్తి కూడా తగ్గిపోతుంది. ఫలితంగా డిమాండ్‌కు సరిపడా గుడ్ల లభ్యత లేక వీటి ధర పెరగడానికి కారణమవుతుందని పౌల్ట్రీ రైతులు పేర్కొంటున్నారు. ఎండల తీవ్రత తగ్గితే మళ్లీ గుడ్ల ఉత్పత్తి పెరుగుతుందని చెబుతున్నారు. మరోవైపు ఉత్తరాంధ్రలోని కోడిగుడ్లపై కోల్‌కతా బహిరంగ మార్కెట్ ప్రభావం ఉంటుంది. అక్కడ మార్కెట్‌కు ఇతర రాష్ట్రాల నుంచి గుడ్లు ఎక్కువగా వస్తే ధర తగ్గుతుందని, ఆ ప్రభావం ఇక్కడ కూడా పడుతుందని వీరు అంటున్నారు. ప్రస్తుతం వేసవి తీవ్రత తగ్గుముఖం పడుతోందని, దీంతో క్రమంగా కోడిగుడ్ల ఉత్పత్తి ఊపందుకుంటుందని, ఫలితంగా రానున్న రోజుల్లో వీటి ధర ఇంకా తగ్గే అవకాశం ఉందని నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) జాతీయ కార్యవర్గ సభ్యుడు భరణికాన రామారావు ‘సాక్షి’కి చెప్పారు.

రోజుకు 40 లక్షల గుడ్ల వినియోగం

ఉత్తరాంధ్రలో వివిధ పౌల్ట్రీల్లో పెరుగుతున్న కోళ్ల ద్వారా రోజుకు సగటున 50 లక్షల కోడిగుడ్ల ఉత్పత్తి జరుగుతుంది. వీటిలో 40 లక్షల గుడ్లు అంటే 80 శాతం వరకు స్థానికంగానే వినియోగమవుతాయి. మిగిలిన 20 శాతం ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతుంటాయి. దాదాపు నెల రోజులుగా కోడిగుడ్ల ధరలు సామాన్యుడికి అందుబాటులో లేకుండా పోయాయి. హోల్‌సేల్‌గా వంద గుడ్లు రూ.550 ధర కొనసాగింది. దీంతో రిటైల్ మార్కెట్లో విడిగా ఒక్కో గుడ్డు రూ.7 చొప్పున విక్రయించడంతో ఈ ధర మధ్య తరగతి వారికి భారంగా మారింది. అయితే ప్రస్తుతం గుడ్డు ధర దిగివస్తుండడం వీరికి కాస్త ఉపశమనం కలిగిస్తోంది. పౌల్ట్రీ రైతులు మాత్రం ఇంతకన్నా ధర తగ్గితే తాము నష్టపోతామని చెబుతున్నారు.

విస్తారంగా వర్షాలు



పెదబయలు అంబేడ్కర్ నగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



పాడేరులో కురుస్తున్న వర్షం



జి.మాడుగులలో ..

సాక్షి,పాడేరు/జి.మాడుగుల/హుకుంపేట/పెదబయలు: జిల్లాలో మూడు రోజుల నుంచి విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం మధ్యాహ్నం పలు ప్రాంతాల్లో భారీగా వర్షం పడింది. పాడేరు ఘాట్‌రోడ్డుతో పాటు,పాడేరు మండలమంతా వర్షం కురిసింది. పంట భూముల్లోకి నీరు చేరింది. సాయంత్రం వరకు వర్షం పడడంతో జనజీవనానికి కాస్త అంతరాయం ఏర్పడింది. జి.మాడుగుల మండలంలోని పలు ప్రాంతాల్లో కుండపోతగా వర్షం కురిసింది. రోడ్లు, పంటపొలాలు జలమయమయ్యాయి. సంతబయలులో జరిగిన వారపుసంతలో సరకులు తడిసి ముద్దయ్యాయి. వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. పాడేరు–జి.మాడుగుల, చింతపల్లి, వంజరి, గెమ్మెలి, సుర్మతి, సొలభం రోడ్లలో రాకపోకలు సాగించే ద్విచక్రవాహనదారులు ఇక్కట్లకు గురయ్యారు. హుకుంపేట మండలం కామయ్యపేట రహదారిలో వరద నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు పడ్డారు. పెదబయలు మండలంలో సుమారు గంటన్నర పాటు భారీగా వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో నీరు చేరింది. రోడ్లు జలమయమయ్యాయి.పెదబయలు అంబేడ్కర్ నగర్‌లో మోకాళ్లలోతు వరకు వర్షం నీరు చేరింది.దీంతో ఆ వీధి వాసులు రాకపోకలకు అవస్థలు పడ్డారు.

క్లుప్తంగా

పింఛన్ పంపిణీకి 125 కిలోమీటర్ల ప్రయాణం



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మత్స్యలింగంకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ ఈశ్వర్

సాక్షి,పాడేరు: వైఎస్సార్ పింఛన్ కానుక సొమ్మును లబ్ధిదారులకు పంపిణీ చేయడంలో వలంటీర్ల సేవలను అన్ని వర్గాల ప్రజలు అభినందిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగానే వలంటీర్లు శ్రమిస్తున్నారు. పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీకి చెందిన గొల్లోరి మత్స్యలింగం అనారోగ్యంతో విశాఖపట్నంలోని మారికవలస సమీపంలో గాయత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడి ఆర్థిక పరిస్థితి తెలుసుకుని గ్రామ వలంటీర్ ఈశ్వర్ 125 కిలోమీటర్లు మేర ప్రయాణించి మంగళవారం అక్కడకు వెళ్లి వృద్ధాప్య పింఛన్ రూ.2,750 అందజేసి, ఎంతో సహాయపడ్డాడు.

గుమ్మ అంగన్‌వాడీలో ఐసీడీఎస్ పీడీ తనిఖీ



గుమ్మ అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న పీడీ సూర్యలక్ష్మి

అనంతగిరి: మండలంలోని గుమ్మ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి మంగళవారం తనిఖీ చేశారు. ఇక్కడ శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా ఉన్న భవనాన్ని వెంటనే ఖాళీ చేసి అద్దె గదిలోకి కేంద్రాన్ని మార్చాలని ఆమె సూచించారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ సరకులు ఇంటి వద్దకే పంపిణీ చేయాలని, కేంద్రం నిర్వహణ సక్రమంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, ఐసీడీఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి అచ్యుత, సర్పంచ్ రాములమ్మ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మన్యంలో ఖరీఫ్ సాగు సందడి

- వరి నారుమడుల తయారీలో రైతన్నల నిమగ్నం
- జోరుగా రాయితీపై విత్తనాల పంపిణీ



వరి నారు పెంచేందుకు దమ్ము చేస్తున్న రైతన్న



దమ్ము చేసి సీడ్ బెడ్స్ తయారు చేస్తున్న రైతులు

రాజవొమ్మంగి: మన్యంలో ఖరీఫ్ వరి సాగు సందడి మొదలైంది. ప్రభుత్వం ఇప్పటికే 90 శాతం రాయితీతో వరి విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తోంది. సాగుకు ముందే రైతు భరోసా సొమ్ములు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేసింది. ఇక రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు ఏవి కావాలన్నా రైతు భరోసా కేంద్రానికి వెళ్తే చాలని రైతన్న వెన్ను తడుతోంది. మరోవైపు ఆశాజనకంగా తొలకరి వర్షాలు కురుస్తుండగా వారు రెట్టించిన ఉత్సాహంతో వరి నారుమడులు తయారీలో నిమగ్నమయ్యారు. సాధారణంగా నేలను మెత్తగా దున్ని పొడి దుక్కులోనే వరి వంగడాలు వెదజల్లి నారుమడులు తయారు చేస్తారు. వర్షాలు ఎడతెరిపి లేకుండా కురుస్తుండటంతో దమ్ములు చేసి బెడ్స్ కడుతున్నారు. వరి వంగడాలను తొలుత నీటిలో నానబెట్టి మొలకలు వచ్చిన తర్వాత వాటితో నారుమడులు తయారు చేస్తున్నారు. ఇప్పటికే పల్లపు భూముల్లో నీరు సమృద్ధిగా చేరడంతో సాగుకు ఢోకా లేదంటూ ముందడుగు వేస్తున్నారు. పొడి దుక్కుల్లో పెంచిన వరి నారు 30 రోజులకు కాని అందుబాటులోకి రాదు. అయితే దమ్ము చేసి వేస్తున్న నారమడులు 20 రోజులకే తీతకు వస్తుంది. దీంతో వెంట వెంటనే నాట్లు వేసుకోవచ్చని మన్యం రైతాంగం భావిస్తోంది. మైదాన ప్రాంతం మాదిరిగానే మెట్టలోనూ దమ్ములు చేస్తు నారు మడులు సిద్ధం చేస్తుండటం వరి సేద్యంలో ఆశాజనకమైన మార్పు అని అంటున్నారు.

సాధారణ విస్తీర్ణానికి మించి: గతేడాది ఖరీఫ్‌లో రంపచోడవరం డివిజన్ ఏడు మండలాల్లో పది వేల హెక్టార్లలో వరి సాగయ్యింది. ఈ ఏడాది సాగు విస్తీర్ణం మరింత పెరిగే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. వరికి ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం, పండిన ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడం, ఆ ధాన్యానికి సొమ్ములు త్వరితగతిన రైతుల ఖాతాలకు జమ చేయడం వంటి అంశాలు మన్యంలో వరి సాగువిస్తీర్ణం పెరిగేందుకు దోహదపడతాయంటున్నారు.

జిల్లాలో 18,354 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం: జిల్లాలోని 22 మండలాలకు సరఫరా చేసేందుకు ఈ ఏడాది ఖరీఫ్‌కు 18,354 క్వింటాళ్ల వరి విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయాధికారి నంద్ తెలిపారు. వీటిని ప్రభుత్వం 90 శాతం రాయితీపై రైతులకు అందజేస్తోందన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 16 వేల క్వింటాళ్ల వరి విత్తనాలను జిల్లా వ్యాప్తంగా ఆర్బీకేలకు తరలించగా పంపిణీ చురుకుగా సాగుతోందన్నారు. గతేడాది 15,800 క్వింటాళ్ల మాత్రమే సరఫరా చేయగా రైతుల అవసరాలను గుర్తించి ఈ ఏడాది ఇండెంట్ పెంచామన్నారు.

మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో 'గడపగడపకు'

దుప్పలవాడ పంచాయతీలో ప్రజా సమస్యలు తెలునుకున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



దుప్పలవాడలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, పక్కన జెడ్పీటీసీ, ఎంపీపీ

గూడెంకొత్తవీధి: ఏవోబీలో ఒకప్పుడు మావోయిస్టులకు నిలయమైన దుప్పలవాడ పంచాయతీలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మారుమూల ప్రాంతంగా పేరున్న దుప్పలవాడ పంచాయతీలో కాట్రగెడ్డ, పిల్లిగెడ్డ, దుప్పలవాడ గ్రామాల్లో 182 గడపలను ఆమె తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు తన దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలను పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరికీ న్యాయం చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఇచ్చిన హామీలను 98.5 శాతం అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే అన్నారు. రెండోసారి పార్టీని అధికారంలోకి తీసుకు రావాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జెడ్పీటీసీ శివరత్నం, ఎంపీపీ బోయిన కుమారి, అల్లూరి జిల్లా ఎస్టీ కమిషన్ సభ్యుడు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్‌లు కిలేబు కుమారి, రామకృష్ణ, ఎంపీటీసీలు కిల్లో ఉల్లాస్, కోఆపరేటివ్ చైర్మన్ ప్రసాద్, వైస్ ఎంపీపీ దేముడు పాల్గొన్నారు.

నేడు ఎం. మాకవరంలో గడపగడపకు

కొయ్యూరు: ఎం. మాకవరం గ్రామ సచివాలయం పరిధిలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి పాల్గొంటారని ఎంపీడీవో లాలం సీతయ్య మంగళవారం తెలిపారు. దీంతోపాటు రేవళ్లు, కొయ్యూరులోని సురక్ష గ్రామసభల్లో పాల్గొంటారన్నారు.

జగనన్న సురక్ష గిరిజనులకు వరం

పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



దుప్పలవాడలో పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సీలేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్ష కార్యక్రమం గిరిజనులకు వరమని ఎమ్మెల్యే కె.భాగ్యలక్ష్మి అన్నారు. మండలంలో దుప్పలవాడ గ్రామ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా 11 రకాల సేవలకు సంబంధించి 375 మందికి ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలో ఓ మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, దీనివల్ల ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందన్నారు. ముఖ్యమంత్రిగా మళ్లీ జగనన్ననే గెలిపించుకుందామని, దీనికి నాయకులు, కార్యకర్తలు ఆయన అమలు చేసిన పథకాలు లబ్ధిదారులకు ఏ విధంగా అందుతున్నాయో చెప్పాలన్నారు. ప్రతిపక్షాలు తలదించుకునేలా నాలుగేళ్లలో పేదలకు చేసిన లబ్ధిని వివరించి మరింత మెజార్టీతో గెలిపించుకునే బాధ్యత మనపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాద్, ఎంపీపీ కుమారి, జెడ్పీటీసీ శివరత్నం, మండలాధ్యక్షుడు బొబ్బిలి లక్ష్మణ్, సర్పంచ్ కుమారి, ఎంపీటీసీ ఉల్లాస్ పాల్గొన్నారు.

సీలేరులో..

సీలేరులో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో 11 రకాల సేవలకు సంబంధించి 996 పత్రాలను పంపిణీ చేశారు. డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామి, ఏపీవో రామ్‌ప్రసాద్, సర్పంచ్ కె.వలీప్రసాద్, ఎంపీటీసీ సాంబమూర్తి, సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పైసా ఖర్చు లేకుండా జగనన్న సురక్ష సేవలు



పెదకోడాపల్లిలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు



కుంతుర్ల సచివాలయంలో ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

పెదబయలు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల గడప వద్దకే అన్ని రకాల సేవలందిస్తుందని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మంగళవారం పెదకోడాపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గ్రామ సచివాలయం పరిధిలోని 295 మంది లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా పైసా ఖర్చు లేకుండా 11 రకాల ధ్రువపత్రాలు జారీ చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో కుల, ఆదాయ ధ్రువపత్రాలు కావాల్సి వస్తే తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, నేడు గ్రామాల్లో గడప వద్దకే వచ్చి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు అందిస్తున్నారని వివరించారు.

అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు: సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ మంజూరు చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. మంగళవారం పెదబయలు మండలం కుంతుర్ల గ్రామ సచివాలయంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ పరిధిలో 221 మందికి ధ్రువపత్రాలు అందించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జర్సింగి సూర్యనారాయణ, జిల్లా ఆడిట్ అధికారి సువర్ణ ఫణి, ఎంపీపీ బి.వరహాలమ్మ, జెడ్పీటీసీ కూడ బొంజుబాబు, ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య, తహసీల్దార్ శెట్టి కృష్ణారావు, వైస్ ఎంపీపీ కొర్రా రాజబాబు, మాజీ ఎంపీపీ సల్లంగి ఉమామహేశ్వరరావు, ఎంఈవో కృష్ణమూర్తి, ఈవోపీఆర్డీ నర్సింగరావు, సీడీపీవో రాజేశ్వరి, ఎంపీటీసీలు అప్పారావు, కోరాబు జ్యోతి, సర్పంచ్ కొండబాబు, నాయకులు రాజారావు, గోపాల్, మండల జేసీఎస్ కన్వీనర్ గంపరాయి అజయ్‌కుమార్, చిన్నారావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం



గిరిజన రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

రంపచోడవరం: ప్రకృతి వ్యవసాయం ద్వారా ఎంతో మేలు ఉందని, గిరిజన రైతులు దృష్టి సారించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ రైతు సాధికారి సంస్థ పుచ్చారి దేవుళ్లు తెలిపారు. మంగళవారం పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక దిగుబడులు సాధించే బయోఫోర్టిఫైడ్ రాగి రకాలైన ఇంద్రావతి, వేగవతి విత్తనాలను వంద మంది గిరిజన రైతలకు పంపిణీ చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి లలితాకామేశ్వరి, శాస్త్రవేత్తలు డాక్టరు చిరంజీవి, డాక్టరు వీరాంజనేయులు, డాక్టరు ప్రవీణ్‌బాబు, డాక్టరు శ్రీనివాసులు, గంగరాజు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు పింఛన్ల పంపిణీ



ఎటపాక: బాధితుడికి పింఛన్ అందిస్తున్న తహసీల్దారు



ముంచంగిపుట్టు: బాధితులకు పింఛన్ అందిస్తున్న సర్పంచ్ రమేష్

ఎటపాక: మండలంలోని సికిల్‌సెల్ ఎనీమియా బాధితుడు మొతుకూరి శ్యామ్‌కు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 వేల పింఛన్‌ను తహసీల్దార్ వేణుగోపాల్ మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ దీర్ఘకాల వ్యాధులతో బాధపడుతున్న వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ అందించటంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సచివాలయాల మండల కన్వీనర్ గోసు ప్రశాంత్, ఎటపాక సచివాలయ కన్వీనర్ కురినాల వెంకట్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: గిరిజన ప్రాంతంలో సికిల్‌సెల్ ఎనీమియా బాధితులకు అండగా ప్రభుత్వం ఉంటుందని సర్పంచ్ వెంగడ రమేష్ అన్నారు. మంగళవారం సుజనకోట పంచాయతీలో సికిల్‌సెల్ ఎనీమియా బాధితులు తలారి శ్రీదేవి, వెంగడ జయంతి, వెంగడ శ్రావణిలకు మంజూరైన రూ. 10 వేల చొప్పున పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. వీరికి ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందిస్తుందన్నారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏకలవ్య రెండో విడత కౌన్సెలింగ్ రేపు

వై.రామవరం: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని మారేడుమిల్లి, రంపచోడవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి, వై.రామవరం మండలం పి.యర్రగొండ గ్రామాల్లోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో ఖాళీ సీట్ల భర్తీకి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు మండలంలోని పి.యర్రగొండ ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ పీవో సూరజ్ ఘనోరే ఆధ్వర్యంలో రంపచోడవరం పీఎంఆర్సీలో ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కౌన్సెలింగ్‌కు ప్రవేశ పరీక్ష రాసిన గిరిజన విద్యార్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. రంపచోడవరం డివిజన్‌లోని ఏకలవ్య పాఠశాలల్లో 6వ తరగతిలో బాలురుకు 56 సీట్లు, బాలికలకు 45 సీట్లు, 7వ తరగతిలో బాలురుకు 10, బాలికలకు 20, 8వ తరగతిలో బాలురుకు 6, బాలికలకు 9 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. 11వ తరగతిలో బాలికలకు ఎంపీసీ గ్రూపులో 6, హెచ్ఈసీలో 1, బాలురుకు బైపీసీలో 3 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు.

రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు



తీవ్రగాయాల పాలైన పి.రాజు, మామిడి లచ్చిరెడ్డి



క్షతగాత్రుడు కృష్ణారెడ్డి

అడ్డతీగల : అడ్డతీగల మండలం వేటమామిడి శివారున మంగళవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లపై ఉన్న ఏలేశ్వరంకి చెందిన పి.రాజు, అడ్డతీగల మండలం పణుకురాతిపాలెం నివాసి మామిడి లచ్చిరెడ్డి, ఏటిపల్లికి చెందిన దాని కృష్ణారెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. రక్తమోడుతూ రహదారిపై పడి ఉన్న క్షతగాత్రులను 108 వాహనంలో అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యులు సతీష్ చికిత్స చేసిన అనంతరం బాధితులకు కాళ్లు విరిగిపోయినట్టు నిర్ధారించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కి రిఫర్ చేశారు. అడ్డతీగల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అకౌంట్ నుంచి రూ.20వేలు మాయం!

మునగపాక : ఒకవైపు పదే పదే సైబర్ మోసాలకు గురికావద్దంటూ అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడో దగ్గర మోసాలకు గురవుతూనే ఉన్నారు. మహిళా పోలీసులు ప్రజలను సైబర్ క్రైంకు సంబంధించి ప్రచారం చేస్తున్నా కొంతమంది కేటుగాళ్ల మాయలో పడి నష్టపోతున్నారు. ఇలాంటి సంఘటన మండలంలోని పల్లపు ఆనందపురంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొంతిన అఖిల బీటెక్ చదువుతుంది. కొద్ది రోజులుగా అఖిలకు ఇతర రాష్ట్రానికి చెందిన వ్యక్తి ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామంటూ పలుమార్లు ఫోన్ చేస్తూ ఇబ్బందులకు గురిచేశాడు. తక్షణమే రూ.20వేలు పంపాలని, లేకుంటే మీ ఇంటిని జప్తు చేస్తామని బెదిరించడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో వారు పంపిన లింక్‌ను క్లిక్ చేసింది. దీంతో అఖిలకు సంబంధించిన బ్యాంక్ అకౌంట్ నుంచి రూ.20వేలు బదిలీ అయినట్టు గుర్తించి మునగపాక పోలీసులను ఆశ్రయించింది. పోలీసుల సూచనలతో ఎస్‌బీఐకి వెళ్లి సంబంధిత అధికారులకు జరిగిన మోసంపై వివరించింది. దీంతో అఖిలకు చెందిన ఖాతా నంబరును హోల్డ్‌లో ఉంచారు. కాగా తనకు న్యాయం జరిగేలా చూడాలని ఆమె పోలీసులను కోరుతున్నారు.

పిడుగుపాటుకు గురై ఒకరి మృతి

కూనవరం: మండలంలోని రేగులపాడులో మంగళవారం సాయంత్రం పిడుగుపాటుకు గురై బొగ్గా శాంతారావు (46) మృతి చెందాడు. గ్రామానికి చెందిన అతడు ఆరుబయట ఉన్న సమయంలో మెరుపులతో కూడిన భారీ శబ్దంతో పిడుగు పడింది. దీంతో షాక్‌కు గురై మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తునట్లు ఎస్సై బి.వెంకటేష్ తెలిపారు. మృతదేహాన్ని కూనవరం ప్రభుత్వాస్పత్రికి తరలించి పోస్ట్‌మార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

మహిళను చంపిన కేసులో నిందితుడికి యావజ్జీవ ఖైదు



నిందితుడు రావాడ ఏసు

విశాఖ లీగల్/పాయకరావుపేట : క్షణికావేశంలో మహిళను అతి కిరాతకంగా హత్య చేసిన వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నగరంలోని 12వ అదనపు న్యాయమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. జైలు శిక్షతో పాటు రూ.5000 జరిమానా చెల్లించాలని, లేని పక్షంలో అదనంగా మూడు నెలలు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావు, పాయకరావుపేట పోలీసులు వేర్వేరుగా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాయకరావుపేట ఇందిరా కాలనీకి చెందిన బొల్లం రాజ్యలక్ష్మి భర్తను విడిచిపెట్టి ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి వద్ద ఉంటోంది. ఇదే క్రమంలో ఇంటి పక్కనే ఉన్న రావాడ ఏసుతో వివాహేతర సంబంధం పెట్టుకొని లింగాల తోటకాలనీలో సహజీవనం చేస్తోంది. రావాడ ఏసు వృత్తిరీత్యా తాపీమేస్త్రి. 2015 అక్టోబర్‌లో నిందితుని భార్య పురిటికి తన పుట్టింటికి వెళ్లింది. ఆ సమయంలో రాజ్యలక్ష్మి ఏసు ఇంట్లో ఉంది. ఈ క్రమంలో వారిద్దరి నడుమ గొడవ జరగడంతో కోపోద్రిక్తుడైన ఏసు 2015 అక్టోబరు 1వ తేదీన అర్ధరాత్రి సమయంలో రాజ్యలక్ష్మిని ఇంటి పక్కనే ఉన్న పనస చెట్టుకు ఆనించి గొంతు నులిమి హత్య చేశాడు. రాజ్యలక్ష్మి చనిపోయిందని ఆమె తల్లికి సమాచారం ఇవ్వడంతో ఆమె వచ్చి తన కుమార్తె మరణంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈమేరకు పాయకరావుపేట పోలీసులు హత్య కేసుగా నమోదు చేశారు. విచారణలో ఇది హత్య అని రుజువై, ఈ దారుణానికి ఒడిగట్టింది రావాడ ఏసుగా నిర్ధారణ కావడంతో విశాఖపట్నం 12వ ఏడీజే కోర్టు వారు మంగళవారం నిందితుడికి శిక్ష విధిస్తూ పై విధంగా తీర్పు చెప్పారు. ఈ కేసు దర్యాప్తు చేసిన ఇన్‌స్పెక్టర్లు కె. వెంకటరావు, జి.రాంబాబు, వాదనలను వినిపించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ వి.దేవానందరావులను జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ అభినందించారు.

కార్లపైకి దూసుకెళ్లిన టిప్పర్

రెండు కార్లు ధ్వంసం, మహిళకు గాయాలు



టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో ధ్వంసమైన కార్లు

చింతూరు : టిప్పర్ అదుపు తప్పి కార్లపై దూసుకెళ్లడంతో ఓ మహిళ తీవ్రంగా గాయపడగా, రెండు కార్లు ధ్వంసమయ్యాయి. చింతూరు మండలం విద్యానగరం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఈ ఘటన జరిగింది. భూమి పండగ నిర్వహణ నిమిత్తం మద్దిగూడెంకు చెందిన కొంతమంది గిరిజన మహిళలు రహదారిపై వాహనదారుల నుంచి చందాలు సేకరిస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. రెండు కార్లను ఆపి చందాలు వసూలు చేస్తుండగా అదే సమయంలో వేగంగా దూసుకొచ్చిన టిప్పర్ రెండు కార్లతో పాటు మరో లారీని ఢీకొట్టింది. దీంతో రెండు కార్లు ధ్వంసం కాగా చందాలు వసూలు చేస్తున్న మహిళ మద్దిగూడెంకు చెందిన మడకం కన్నమ్మకు తీవ్రగాయాలయ్యాయి. ఆమెకు ఏడుగురాళ్లపల్లి పీహెచ్‌సీలో ప్రాథమిక చికిత్స నిర్వహించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం భద్రాచలం తరలించారు. అలాగే మండలంలోని చట్టిలో కూనవరం జంక్షన్ వద్ద జరిగిన ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొట్టిన ఘటనలో కూనవరం మండలం రేపాకకు చెందిన సోయం సీతయ్యకు గాయాలయ్యాయి.

వీఆర్వీ అనంతలక్ష్మికి షోకాజ్ నోటీస్

రోలుగుంట : మండలంలోని బుచ్చింపేట వీఆర్వీ అయిన అనంతలక్ష్మికి ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిందన్న ఆరోపణలపై డ్వామా పీడీ షోకాజ్ నోటీస్‌ను మంగళవారం జారీ చేశారని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో కోసూరి సూర్యామణి తెలిపారు. గ్రామంలో 15 ఏళ్లుగా వీఆర్వీగా పనిచేస్తూ దొంగ మస్తర్లు వేస్తున్న వైనంపై గ్రామానికి చెందిన మూడు చెరువుల్లో అభివృద్ధి పనులు చేస్తున్న ఉపాధి కూలీలు అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డ్వామా జిల్లా విభాగం ఏపీడీ రోజారాణి, యలమంచిలి ఏపీడీ బి.శ్రీనివాసరావు గత నెల 27న గ్రామ సచివాలయంలో విచారణ జరిపి నివేదికను అందజేశారు. దీనిని పరిశీలించిన డ్వామా పీడీ సందీప్ వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని అనంతలక్ష్మికి షోకాజ్ నోటీసును జారీ చేశారు.